COMMUNIST PARTY OF INDIA (MARXIST)

ANDHRA PRADESH COMMITTEE

H.No. 27-28-12, CPI(M) State Committee Office
Yamalavari Street, Governor Pet, Vijayawada -2
☎ 0866 - 2577202, Fax: 0866 - 2577203
E-mail: cpimap@gmail.com


ప్రచురణార్థం/ప్రసారార్థం : విజయవాడ,

**తేది : 09 ఆగస్టు, 2022.**

## ట్రూ అప్ చార్జీల నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలి

**: సిపిఐ(యం)**

విద్యుత్ వినియోగదారుల నుండి 36 నెలలపాటు ట్రూఅప్ ఛార్జీలు వసూలు చేయాలన్న విద్యుత్ పంపిణీ సంస్థల నిర్ణయాన్ని సిపిఐ(యం) ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కమిటీ తీవ్రంగా ఖండిస్తున్నది. అధిక ధరలతో సతమతమవుతున్న ప్రజలపై ట్రూఅప్ చార్జీల భారం వేయాలన్న నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని సిపిఐ(యం) డిమాండ్ చేస్తున్నది.

2014 –15 నుండి 2018–19 వరకు డిస్కంలకు వచ్చిన నష్టాలను పూడ్చుకోవడానికి వినియోగదారుల నుండి 36 నెలల పాటు వసూలు చేయాలని వివిధ పంపిణీ సంస్థలు తాజాగా నిర్ణయం తీసుకున్నాయి. గతంలో యూనిట్‌కు రు.1.27 చొప్పున ట్రూఅప్ చార్జీలు వసూలు చేసినదానికి రాష్ట్రవ్యాప్తంగా ప్రజల నుండి పెద్దయెత్తున నిరసనలు వ్యక్తమవడంతో కొన్ని నెలలపాటు వసూలు చేసిన మొత్తాన్ని తరువాత బిల్లుల్లో సర్దుబాటు చేశారు. ఈసారి అలా కాకుండా అత్యధిక జిల్లాల్లో యూనిట్‌కు 0.22పైసల చొప్పున ఈ ఆగస్టు నెల నుండి రాబోయే 3 సంవత్సరాలపాటు వసూలు చేయబోతున్నారు.

ఏప్రిల్ నుండి శ్లాబులు మార్చి టారిఫ్ పెంచి భారం మోపారు. అదనపు డిపాజిట్లు పేరుతో అడ్డగోలుగా వసూళ్ళు చేశారు. ఎస్సీ, ఎస్టీ వర్గాలకు ఇచ్చే విద్యుత్ రాయితీలకు కోతలు పెడుతున్నారు. వీటికి తోడు 2014–15 నుండి 2018–19 సంవత్సరాలలో వాడిన యూనిట్ల ఆధారంగా ట్రూఅప్ చార్జీలు వసూలు చేయడం పూర్తిగా అసంబద్ధమైన నిర్ణయం. ఇంటి యజమానులపైనా భారం వేయడమే కాకుండా శాశ్వతంగా ఒక చోట ఉండని అద్దె వినియోగదారులపై భారం వేయడం గర్హనీయం. ప్రస్తుత వినియోగం తక్కువ ఉన్నా గత వినియోగాన్ని బట్టి వసూలు చేయడమంటే ప్రజలను దోపిడీ చేయడమే అవుతుంది. విద్యుత్ ఛార్జీలు తగ్గిస్తామని హామీ ఇచ్చిన రాష్ట్ర ప్రభుత్వం ప్రజలపై భారాలను మోపే ఈ నిర్ణయాన్ని వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాము. ట్రూఅప్ ఛార్జీలను పూర్తిగా రద్దు చేయాలని డిమాండ్ చేస్తున్నాము.

**(వి.శ్రీనివాసరావు)**

రాష్ట్ర కార్యదర్శి